సాక్షి మంచిర్యాల

శుక్రవారం | 28 | జూన్ | 2024



సర్కారు బడికీ ఫ్రీ కరెంటు

ప్రభుత్వ బడులకూ ఉచిత కరెంటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గృహజ్యోతి పథకం కింద ఇళ్లకు జీరో బిల్లులు ఇస్తోంది. సర్కారు స్కూళ్లకూ వర్తించనుంది. 8లో▸



వరద మొదలైతే తిప్పలే..!

వర్షాకాలం మొదలైంది. వాగులు, ఒర్రెలు ఉప్పొంగితే మారుమూల గ్రామాలకు రవాణా తిప్పలు మొదలవుతాయి. లోలెవల్ వంతెనల వద్ద రాకపోకలు నిలుస్తాయి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం 32.0 /26.0

వాతావరణం

వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కందిపప్పు సరఫరాకు టెండరు పూర్తి

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు సరఫరా నిలిచిపోగా, 'అందని పౌష్టికాహారం' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. టెండరు ప్రక్రియ ముగిసి జూన్‌లో కందిపప్పు సరఫరా అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిపోవడం, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించలేకపోవడం విషయాలను వెలుగులోకి తెచ్చింది. గురువారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య కందిపప్పు సరఫరాకు టెండరు ప్రక్రియను పూర్తి చేశారు. రెండు రోజుల్లోపు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కోడిగుడ్లు చిన్న సైజులో వస్తే టీచర్లు తీసుకోవద్దని, అలా తీసుకుంటే ఆయా టీచర్లపైనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దగా ఉండే కోడిగుడ్లను మాత్రమే తీసుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూమి పునరుద్ధరణ, ఎడారీకరణపై కవిత పోటీలు

మంచిర్యాలఅర్బన్: జాతీయ పర్యావరణ దినోత్సవంలో భాగంగా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితిస్థాపికత అనే అంశంపై ఈ నెల 27న జిల్లా సైన్స్ కేంద్రంలో కవిత, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఎకో క్లబ్ రిజిష్టర్ చేసిన పాఠశాలల్లోని 8, 9వ తరగతి ఎకో క్లబ్ విద్యార్థులు గూగుల్ ఫారం ద్వారా రిజిష్టర్ చేయించుకోవాలని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిషులో కవితలు రాయవచ్చని, ఒక విద్యార్థి ఒక పోటీకి మాత్రమే రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. ఒక పాఠశాల నుంచి కవిత పోటీల్లో ఐదుగురు, పోస్టర్ మేకింగ్‌లో ఐదుగురు చొప్పున పాల్గొనవచ్చని తెలిపారు. EEPMO EFCC.NIC.IN లింక్ ద్వారా ఈ నెల 28లోపు పూర్తి చేయాలని, వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీ కార్గోలో ఎలుకల గోల



కార్గో కేంద్రంలో ఏర్పాటు చేసిన బోన్ చుట్టూ ఎలుకలు

మంచిర్యాలఅర్బన్: నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు ఏర్పాటు చేసిన మంచిర్యాల ఆర్టీసీ కార్గో సర్వీసు(లాజిస్టిక్, పార్శిల్) కేంద్రంలో ఎలుకల గోలతో తల పట్టుకుంటున్నారు. కార్గో కేంద్రంలోని గదుల్లో ఫ్లోరింగ్ దెబ్బతిని పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. ఇందులో ఎలుకలు ఉండడంతో విలువైన సామగ్రి పాడవుతుందనే భయం వెంటాడుతోంది. ఇప్పటి వరకు చిన్న చిన్న సరుకులు ఎలుకలు పాడు చేయగా.. ఉద్యోగులు, సిబ్బంది వినియోగదారులకు నచ్చజెప్పారు. విలువైన వస్తు సామగ్రి ఎలుకల బారిన పడకముందే కార్గోలో కనీస వసతుల కల్పనకు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రెండ్రోజుల క్రితం ఒక్క రోజే 40కి పైగా ఎలుకలు పట్టి దూరంగా వదిలిపెట్టారు. గురువారం కార్గో కేంద్రంలో ఏర్పాటు చేసిన బోన్ చుట్టూ ఎలుకలు కనిపించాయి.

టెలికాం రంగ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కేవీ.సురేష్‌బాబు

నస్పూర్: నేటి సమాజంలో టెలికాం రంగ సేవలు అత్యంత కీలకమైనవని, వాటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) జాయింట్ అడ్వయిజర్ కేవీ.సురేష్‌బాబు అన్నారు. ట్రాయ్ ఆధ్వర్యంలో వినియోగదారులకు సీసీసీ సింగరేణి గెస్టుహౌజ్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ అడ్వయిజర్ మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడడంలో ట్రాయ్ పాత్ర ముఖ్యమైనదని తెలిపారు. పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి ట్రాయ్ సహాయపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, అధికారులు బి.ప్రవీణ్‌కుమార్, హేమంత్ రాథ్వే, డీసీఎం అరవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు భూములు కబ్జా!



జిల్లా కేంద్రం మంచిర్యాలలోని 422సర్వే నంబరులో ఉన్న హద్దురాయి



జాఫర్‌నగర్‌లో 422సర్వే నంబరులో ప్రభుత్వ భూమి వివాదంలో ఉందని చూపుతున్న బోర్డు



గత నెలలో సర్వే నంబరు 140లోని సర్కారు భూమిలో చదును చేసేందుకు వచ్చిన యంత్రాలు

- విలువైన ప్రభుత్వ స్థలాలు పరాధీనం
- జిల్లా కేంద్రంలో అనేక చోట్ల అన్యాక్రాంతం
- కఠిన చర్యలు లేక అక్రమార్కుల చెలాయింపు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాల, చుట్టుపక్కల ఉన్న సర్కారు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. పరిశ్రమలు, సాగునీటి, అసైన్డ్, చెరువులు, కుంటలు, శిఖం భూములు అనే తేడా లేకుండా కబ్జాకు గురయ్యాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.కోట్ల విలువ చేసే భూములను కొందరు కారుచౌకగా కొట్టేస్తున్నారు. తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల్లో దళారులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టిస్తూ సర్కారు భూములకు ఏకంగా పట్టాలు సృష్టిస్తున్నారు. మంచిర్యాల, గర్మిళ్ల, నస్పూర్ శివారులో పెద్దమొత్తంలో భూములు పరాధీనం అయ్యాయి. ఈ క్రమంలో కొత్తగా వచ్చిన కలెక్టర్ కుమార్‌దీపక్ జిల్లా కేంద్రం నుంచే సర్కారు భూముల రక్షణకు పూనుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజావసరాలకు ఉపయోగించే విలువైన భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని కోరుతున్నారు. పకడ్బందీగా హద్దులు వేసి ఆన్‌లైన్ జియోట్యాగ్ చేసి భవిష్యత్ తరాలకు అందించాలని వేడుకుంటున్నారు.

ఫలహారమైన ప్రభుత్వ భూములు

- భూదాన్ భూములు సర్వేనంబరు 707, 708, 65లో ఆక్రమణల పాలయ్యాయి. ఇందులో కొంత మేర రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ పరిధి నుంచే ఇక్కడి భూములు అన్యాక్రాంతం అయ్యాయి.
- జిల్లా కేంద్రంలోనే రాళ్లవాగు ఆనుకుని ఉన్న సర్వే నంబరు 140లో కబ్జాలు జరిగాయి. మిగిలిన రెండెకరాల్లో మున్సిపాలిటీ అధికారులు మొక్కలు సైతం నాటారు. గత నెలలో పట్టపగలే కొందరు బ్లేడు ట్రాక్టర్లతో చదును చేస్తూ మొక్కలు తీసే ప్రయత్నం చేయగా, అధికారులు అడ్డుకున్నారు.
- పట్టణ వాసులకు నీటి వనరుగా ఉండి, ఆహ్లాదాన్ని పంచే రాముని చెరువు కబ్జాల గండంలోనే ఉంది. సర్వే నంబరు 371లో 42.22ఎకరాల శిఖం భూమిలో చాలా వరకు ఆక్రమణల పాలయ్యాయి. అప్పటి కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆక్రమణలను నిలువరించేదుకు 371, 406లో హద్దులు ఏర్పాటు చేశారు. అయితే ఆనకట్టతోపాటు చెరువు శిఖం పరిధిలోనే ప్లాట్లు చేసి అమ్మేశారు.
- జిల్లా కేంద్రంలోని 422 సర్వేనంబరులో మొత్తం 13.39 ఎకరాల భూమిలో ప్రస్తుతం ఎంత మిగులు భూమి ఉందనే లెక్కలే లేవు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ పొరంపోగు(పీపీ) భూమిలో ఇప్పటికే కొందరు ఆక్రమణలు చేయగా, కొన్ని కోర్టు కేసులు ఉన్నాయి.
- రాళ్లవాగు రక్షణ గాలికొదిలేశారు. జిల్లా ఏర్పాటు తర్వాత వాగుకు ఇరువైపుల ఆక్రమణలు తొలగించి, వనాలు నిర్మిస్తామనే హామీలు నీటిలో కలిసిపోయాయి. ఇక్కడ రోజురోజుకు కబ్జాలు జరుగుతున్నాయి. మందమర్రి మండల పరిధిలో మొదలై, మంచిర్యాల పట్టణం గుండా ప్రవహించి గోదావరిలో కలిసే వరకు కుచించుకుపోతోంది. ఇరువైపుల వెలిసిన నిర్మాణాలతో భారీ వర్షాలు కురిస్తే బ్యాక్ వాటర్ వరదలతో లోతట్టు కాలనీలు నీట మునుగుతున్నాయి.
- కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న నస్పూర్ పట్టణంలో సర్కారు భూములంటే ఫలహారంలా మారిపోయాయి. సర్వే నంబర్లు 32, 22, 42,64, 71, 119లో అనేక కబ్జాలు జరిగాయి. ఇక్కడి సర్కారు భూములపై 35కోర్టు కేసులు విచారణలో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 42సర్వే నంబరులో నిత్యం వివాదాలు రగులుతూనే ఉన్నాయి.
- ఇక మంచిర్యాల పట్టణం నడిబొడ్డున ఉన్న కార్మెల్ స్కూల్ వెనకవైపు, రాళ్లవాగుకు సమీపంలో ఉన్న 283సర్వే నంబరులో 13.35ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ లావణి పట్టాల పేరుతో మిగులు సర్కారు భూమిని కాజేస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లినా అధికారులకు పట్టింపు కరువైంది.

నీరున్నా కరెంటు కనెక్షన్ లేదు..!

- నిరుపయోగంగా బోర్లు
- బీడుగా పంట భూములు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: బోర్లలో నీరున్నా కరెంటు కనెక్షన్లు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. భూములు బీడు వారాయి. కరెంటు కనెక్షన్ల కోసం గిరిజన రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. జిల్లాలోని నెన్నెల మండలం కోనపేట, బోగంపల్లి గ్రామాల్లో గిరిజన రైతులకు 2019లో సీఎం గిరి వికాస పథకం(సీఎంజీవీకే) కింద బోరు బావులు, విద్యుత్ లైన్లు మంజూరయ్యాయి. ఒక్కో రైతు బోరు మోటారు కనెక్షన్ కోసం రూ.5లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. 2022లో గ్రామీణాభివృద్ధి, గిరిజన శాఖ, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు రైతుల భూముల్లో నీటి వనరుల లభ్యతపై సర్వే చేశారు. బోరు బావులకు విద్యుత్ లైన్ సర్వే కూడా చేపట్టారు. లబ్ధిదారుల ఎంపిక, బోర్లు, వాటిలోకి పైపులు కూడా వేశారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖకు డీఆర్‌డీఏ నుంచి నిధులు మంజూరు చేశారు. నెన్నెల నుంచి కోనంపేట గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దారి మధ్యలో రెండు కిలోమీటర్ల వరకు రిజర్వు ఫారెస్టు ఉంది. దీంతో ఈ దారి గుండా త్రీఫేస్ 11కేవీ లైన్ వేసేందుకు అటవీ శాఖ అనుమతించడం లేదు. రైతులు రెండేళ్లుగా విద్యుత్ శాఖ, గ్రామీణాభివృద్ధి, గిరిజన శాఖ అధికారుల వద్దకు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కలెక్టరేట్‌లో ప్రజావాణిలోనూ మూడు వారాలుగా ఫిర్యాదు చేస్తున్నారు. విద్యుత్ లైన్ వేయాలని కలెక్టర్‌ను కోరుతున్నారు. కన్నెపెల్లి మండలం రెబ్బన గ్రామం మీదుగా ఎలాంటి అటవీ భూమి లేదని, ఆ రహదారి గుండా విద్యుత్ లైన్ వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భూములు బీడు



బోర్లు ఉండి పంట పొలాలు బీడుగా మారే దుస్థితి ఉంది. గిరిజన రైతుల కోసం ప్రభుత్వం బోర్లు మంజూరు చేసి కరెంటు కనెక్షన్ ఉచితంగా అందించాలని గిరి వికాస్ పథకంలో ఎంపిక చేసింది. బోర్లు వేసింద్రు, నీళ్లు పడ్డయి. ఇగ రెండు పంటలు పండుతాయని సంబరపడ్డాం. కానీ కరెంటు లైన్ లేక బీడుగానే ఉండుడు అయితంది.

– ఈగం మధునయ్య, గ్రామం: మన్నెగూడెం, మం: నెన్నెల

రెండేళ్లుగా తిరుగుతున్నాం..



కరెంట్ లైన్ కోసం రెండేళ్లుగా ఆఫీస్‌ల పొన్న తిరుగుతున్నాం. కానీ లైన్ అయితే వేస్త లేరు. అటవీ భూమి ఉందని, అనుమతి లేదని లైన్ రాదంటున్నారు. వేరే దారి గుండా కరెంట్ లైన్ వేయాలని కలెక్టర్ ఆఫీసుకు మూడు సార్లు పోయి సారుకు మా బాధ చెప్పుకున్నాం.

– మంచాల మారయ్య, గ్రామం: కోనంపేట, మం: నెన్నెల

అటవీ అనుమతి లేకనే..

అటవీశాఖ అనుమతి లేకనే విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ లైన్ వేయడం లేదు. వేరే దారి గుండా రైతులు కోరుతున్నారు. కానీ దూరం ఎక్కువగా ఉన్నందున అంచనా రెట్టింపు అవుతుంది. గతంలో విడుదల చేసిన నిధుల ప్రకారమే చెల్లింపు ఉంటుంది. విద్యుత్ శాఖ, అటవీశాఖ అధికారులతో చర్చించి విద్యుత్ లైన్ వేసేలా చర్యలు చేపడుతాం.

– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

ఒకటి నుంచి కొత్త చట్టాలు అమలు

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు
- ముగిసిన నెల రోజుల శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: జూలై ఒకటో తేదీ నుంచి కొత్త చట్టాలు అమల్లోకి రానున్నాయని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. దేశంలో మారుతున్న నూతన చట్టాలపై రామగుండం కమిషనరేట్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులకు నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఇకపై పోలీసుశాఖలో సీఆర్‌పీసీ, ఐపీసీలు ఉండవని, వీటి స్థానంలో దేశవ్యాప్తంగా బీఎన్ఎస్(భారతీయ నాగరిక్ సురక్ష, సంహిత్), బీఎస్ఎస్(భారతీయ సాక్ష్యా ఆదినియం–2023) వినియోగంలోకి వస్తాయని తెలిపారు. కొత్త చట్టాలపై ప్రతీ పోలీసు అధికారికి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో శిక్షణ తరగతులు నిర్వహించామని అన్నారు. విధి విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు సరైన న్యాయం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. కొత్త చట్టాలపై శిక్షణ ఇచ్చిన అడిషనల్ డీసీపీ రాజు, ఏసీపీ మల్లారెడ్డిలను అభినందించారు. అనంతరం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలంపై ఆందోళనలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- టీబీజీకేఎస్ నేతల సమావేశం



టీబీజీకేఎస్ నేతలతో మాట్లాడుతున్న కేటీఆర్

శ్రీరాంపూర్: కొత్త బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ పెద్దయెత్తున సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నేతలతో ఆయన సమావేశం అయ్యారు. సింగరేణిలో ఉద్యమ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేంద్రం తెలంగాణ పరిధిలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సింగరేణి భవిష్యత్ అంధకారంలో పడిందని, ప్రైవేటు సంస్థలకు మేలు చేసి ప్రభుత్వ సంస్థలను దివాళా తీయించేలా కేంద్రం నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ పోరాడి బొగ్గు బ్లాకుల వేలం అడ్డుకుందని, నాడు వ్యతిరేకించి కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత వత్తాసు పలుకడాన్ని కార్మికుల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. కొత్త గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచీ ఇంచార్జీ పెట్టం లక్ష్మణ్, నాయకులు పానగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్
- మున్సిపల్ కార్యాలయం సందర్శన



ఆసుపత్రి పనుల వివరాలు అడుగుతున్న కలెక్టర్

నస్పూర్: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. గురువారం ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. కమిషనర్ చిట్యాల సతీష్, చైర్మన్ సురమిల్ల వేణుతో కలిసి కార్యాలయంలోని వివిధ విభాగాలు, ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ సరఫరా, వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. పట్టణంలో అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని తెలిపారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంప్ యార్డుకు తరలించాలని సూచించారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేయాలని అన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

లక్సెట్టిపేట: ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నాణ్యతగా చేట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అప్పగించాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయాన్ని ఖాళీ చేసి ఆసుపత్రి నిర్మాణానికి అప్పగించాలని కమిషనర్‌కు అన్నారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, కమిషనర్ కల్లెడ రాజశేఖర్ పాల్గొన్నారు.

బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా కృషి

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్–భీమారం మధ్య జోడువాగులపై బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు పనులు వెంటనే పూర్తయ్యేలా కృషి చేస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. అటవీ అనుమతుల కోసం గురువారం ఢిల్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి జాతీయ రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2016లో నిజామాబాద్–జగ్దల్‌పూర్ 63వ జాతీయ రహదారి నిర్మాణాన్ని మంజూరు చేసిందని తెలిపారు. జోడువాగుల వద్ద వంతెన నిర్మాణానికి అటవీ, పర్యావరణ అనుమతులు తీసుకురావడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఫారెస్ట్ అనుమతుల కోసం కేంద్రానికి నిధుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేయడంతో వంతెన నిర్మాణానికి నోచుకోలేదని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

నీట్, ఎన్‌టీఏలను రద్దు చేయాలని నిరసన



ప్రదర్శనలో కమిటీ జిల్లా బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: నీట్, ఎన్‌టీఏలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ(టీఎస్ఈసీ) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ–2020) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయవద్దని డిమాండ్ చేశారు. నీట్, యూజీసీ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన ఎన్‌టీఏ అధికారులను సస్పెండ్ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. సీబీఐతో కాకుండా సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జూడిషియల్ కమిటీ వేసి విచారణ జరిపించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు కుమార్, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

నీటి మళ్లింపు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు మంచినీటిని సరఫరా చేసే పంప్‌హౌజ్ వద్ద నీటి నిలువలు పడిపోయాయి. ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు స్పందించి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా గురువారం పంప్‌హౌజ్ వద్దకు నీటి మళ్లింపు పనులను మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేశ్ కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, కౌన్సిలర్లు పూదరి ప్రభాకర్, సంజీవ్, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్, నాయకులు సిరిపురం రాజేశ్, కొండపర్తి ప్రభాకర్, అశోక్‌తేజ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం ఉండద్దు..

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని మున్సిపాలిటీలతోపాటు నియోజకవర్గ ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్ట్‌ను సందర్శించడంతోపాటు మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్‌దీపక్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, భవిష్యత్తులోనూ నీటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద జిల్లాలో నీటి సరఫరాపై ప్రతీరోజు నివేదిక అందజేయాలన్నారు. ప్రాజెక్ట్‌లో నీటిమట్టం తగ్గుతున్నందున ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నంచి సరిపడా నీటిని ఇంటెక్‌వెల్ వరకు జేసీబీలతో తీస్తున్న కాలువల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, మిషన భగీరథ ఈఈ మధుసూదన్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పెద్ద చెరువు సమస్య పరిష్కారం



ఒప్పంద పత్రాలు అందజేస్తున్న గంగపుత్రులు

చెన్నూర్: చెన్నూర్ పెద్ద చెరువు సమస్య పరిష్కారమైంది. ముదిరాజ్, గంగపుత్రులు చర్చించుకుని వాటా విషయం తేల్చుకున్నారు. పెద్ద చెరువులో ముదిరాజ్‌లకు 50శాతం వాటా ఇస్తున్నట్లు ప్రకటించడంతో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న వివాదం ముగిసింది. గురువారం రెండు కులాల పెద్దమనుషులు కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇరువర్గాల సమ్మతితో ముదిరాజ్ కులస్తులు పెద్ద చెరువులో చేపలు పట్టుకునేందుకు 50శాతం వాటా ఇస్తున్నామని మత్స్య సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు అంబాటి శంకర్, మాదరబోయిన శ్రీనివాస్ తెలిపారు. సమాన హక్కు ఉంటుందని ఒప్పందపత్రం రాసుకున్నారు. ముదిరాజ్ కులస్తులు గిరెల్లి మల్లయ్య, జోడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

బదిలీలకు ముందే పదోన్నతులు పూర్తి చేయాలి

కోటపల్లి: స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు ఇవ్వగా మిగిలిన అన్ని ఖాళీలను సీనియార్టీ జాబితాలో తదుపరి ఉన్న ఎస్జీటీలతో భర్తీ చేయాలని, ఆ తర్వాతే ఎస్జీటీల బదిలీలు చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లాలో సుమారు 800 మంది ఎస్జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకోగా, వెబ్ ఆప్షన్స్ ఎంచుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఉంటుందని తెలిపారు. ఒక రోజుకు 400 మందికి మాత్రమే బదిలీలు చేపట్టేలా అధికారులు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తపస్ నాయకులు భూమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రఘు (ఫైల్)

జన్నారం: ఈ నెల 25 న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన దండేపల్లి మండలం తాళ్లపేటకు చెందిన కుందారపు రఘు (27) గురువారం మృతి చెందినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 25న జన్నారం మండలం పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఈద్గా ప్రాంతంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ముందుగా లక్సెట్టిపేటకు అక్కడి నుంచి కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

నెన్నెల: భూ తగాదాలో మన్నెగూడం గ్రామానికి చెందిన పోగుల శ్రీనివాస్, మల్లేశ్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన పోగుల అమ్మక్క, పోగుల హరీష్, పోగుల విక్రమ్‌లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆస్తి పంపకాల్లో అన్నదమ్ముల కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. భూములు పంచుకుందామని పిలిచి రాత్రిపూట పడుకొని ఉన్న శ్రీనివాస్, మల్లేశ్‌పై కర్రలతో దాడి చేసి గాయపర్చారని పేర్కొన్నారు. భూముల జోలికొస్తే చంపేస్తామని బెదిరించారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కలప స్వాధీనం

వేమనపల్లి: మండలంలోని ముక్కిడిగూడెం శివారులోని చింతచెట్టు సమీప ప్రాణహితలో నిల్వ ఉంచిన టేకు కలప స్వాధీనం చేసుకున్నట్లు అటవీ రేంజర్ గోవింద్‌చంద్ సర్దార్ తెలిపారు. ప్రాణహిత అవతలి వైపు ఉన్న మహారాష్ట్ర అటవీ ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు నది నుంచి వేమనపల్లి వైపునకు తీసుకొచ్చి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచడంతో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.19 వేలు ఉంటుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని ధరంపెల్లి వాగునుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా మూడు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తెలిపారు. రవీంద్రనగర్‌కు చెందిన విశ్వజిత్ మండల్, డబ్బా గ్రామానికి చెందిన సోనుర్లె వినోద్, కౌటాలకు చెందిన దండిక వెంకటేష్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సర్కారు బడికీ ఫ్రీ కరెంటు

- పాఠశాలలకు ఉచిత విద్యుత్‌పై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- డిజిటల్ విద్యాబోధనకు మరింత సౌలభ్యం
- ప్రత్యేక పోర్టల్ ద్వారా పాఠశాలల అనుసంధానం
- ఉమ్మడి జిల్లాలో 4,116 పాఠశాలలకు ప్రయోజనం

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రభుత్వ పాఠశాలలు
నిర్మల్	842
ఆదిలాబాద్	1,279
మంచిర్యాల	847
కుమురంభీం	1,148
మొత్తం	4,116


ఎల్ఈడీ తెరపై నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 200 యూనిట్లలోపు గృహావసరాలకు వినియోగించే విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. ప్రభుత్వ విద్యా సంస్థలకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఉపాధ్యాయులు, విద్యావేత్తల నుండి వినతులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలలు, తదితర విద్యా సంస్థలకు వినియోగించే విద్యుత్‌ను కూడా ఉచితంగా అందించేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4,116 ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం దక్కనుంది. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలోని పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన కోసం ఎల్ఈడీ తెరలు, ప్యానల్ బోర్డులను సమకూర్చింది. ఉపాధ్యాయులకు మార్కుల నమోదు, విద్యార్థుల ప్రగతి వివరాలు, అడ్మిషన్ల వివరాలను నిక్షిప్తం చేసేందుకు ట్యాబ్‌లు కూడా అందించారు. దీంతోపాటు ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగానూ ప్రతీ పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ అందిస్తోంది. గతంలో వీటి నిర్వహణకుగానూ విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ప్రధానోపాధ్యాయుల నుండి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. పాఠశాల నిర్వహణ గ్రాంట్లు పెద్ద మొత్తంలో కరెంటు బిల్లుల చెల్లింపుల కోసమే వినియోగించేవారు. స్కూల్ గ్రాంట్లు కూడా సకాలంలో విడుదల కాకపోవడంతో వేల రూపాయల కరెంటు బిల్లులు బకాయిల రూపంలోనే ఉండిపోయేవి. ఉచిత విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించడంతో డిజిటల్ విద్యా బోధన పూర్తిస్థాయిలో కొనసాగేందుకు అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇక నుంచి జీరో బిల్లులు...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వరంగంలో ప్రాథమిక, ఉన్నత తదితర పాఠశాలలు 4,116 ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో 842, ఆదిలాబాద్ జిల్లాలో 1,279, మంచిర్యాల జిల్లాలో 847, కుమురంభీం జిల్లాలో 1,148 పాఠశాలలు ఉన్నాయి. ఉచిత విద్యుత్‌ను అందించనుండడంతో ఇక నుంచి ప్రతినెల మీటర్ రీడింగ్ తీసి జీరో బిల్లులు అందజేయనున్నారు. విద్యుత్ దుర్వినియోగం కాకుండా వీటిపై ప్రభుత్వ, విద్యుత్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. బిల్లుల మొత్తాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందిస్తే వారు విద్యుత్ శాఖ వారికి చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థ పాఠశాలలకు అందించే ఉచిత విద్యుత్ వివరాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసి ఆయా ప్రభుత్వ పాఠశాలలను అనుసంధానం చేయనున్నారు.

డిజిటల్ బోధనకు మార్గం సుగమం

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రెండేళ్ల నుంచి తరగతి గదుల్లో వినియోగించే డిజిటల్ ప్యానెల్ బోర్డులు, ఎల్ఈడీ తెరలు, ప్రొజెక్టర్లు, మైక్‌సెట్‌లు, ఫ్యాన్లు, లైట్లు వంటివి అందుబాటులోకి వచ్చాయి. అయితే వీటికి విద్యుత్ వినియోగం భారమవుతుందనే ఉద్దేశంతో ప్రతీరోజు బోధనాభ్యసనలో వినియోగించేందుకు ఉపాధ్యాయులు వెనుకాడేవారు. ప్రస్తుతం ఉచిత విద్యుత్ అందించనున్న నేపథ్యంలో వీటి పూర్తిస్థాయి వినియోగానికి మార్గం సుగమమైంది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సముచిత నిర్ణయం



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సముచితమైనది. గతంలో పాఠశాల గ్రాంట్లలో 80 శాతం నిధులను కరెంటు బిల్లులు చెల్లించేందుకే వినియోగించాల్సివచ్చేది. దీంతో పాఠశాల నిర్వహణలో భాగంగా పరిణమించేవి. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వడంవల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– టి.నరేంద్రబాబు, పీఆర్టీయూటీఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

గుట్కా పట్టివేత


స్వాధీనం చేసుకున్న గుట్కాతో పోలీసులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని దుర్గానగర్‌లో గల గోదాంలో గురువారం దాడులు నిర్వహించి రూ.2,56,850 విలువ గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, గోదాం నిర్వాహకుడు సంజయ్‌కుమార్ అసావాపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పట్టణంలోని ఇందిరామార్కెట్‌కు చెందిన ద్వారకాప్రసాద్ ఝూవర్ గోదాంలో నిల్వ ఉంచిన రూ.37 వేల విలువైన గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై అంజన్న తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సై మహేందర్, అంజన్న పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని నూర్ కిరాణ దుకాణం గోదాంలో నిల్వ ఉంచిన గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించగా రూ.12,573 విలువైన గుట్కా పట్టుకున్నట్లు తెలిపారు.

కానిస్టేబుల్‌పై అదనపు కట్నం కేసు నమోదు

మంచిర్యాలక్రైం: కానిస్టేబుల్‌పై గురువారం అదనపు కట్నం కేసు నమోదు చేసినట్లు స్థానిక మహిళా పోలీస్ స్టేషన్ సీఐ చిప్ప రాజమౌళి గౌడ్ తెలిపారు. చెన్నూర్‌కు చెందిన కాపురపు సురేష్ శ్రీరాంపూర్‌లోని అర్‌కే6 కాలనీకి చెందిన మాధవిని 2018 మార్చి 14న పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. వివాహం సమయంలో రూ.22 లక్షల నగదుతో పాటు రెండు తులాల బంగారం, పల్సర్ బైక్ అప్పగించారు. మరో రూ.5 లక్షలు తేవాలంటూ కొంతకాలంగా సురేష్‌తో పాటు తల్లి లక్ష్మి, అన్నయ్య మహేందర్, అతని భార్య సుదర్శనమ్మ, చెల్లి రాధిక వేధిస్తుండడంతో మాధవి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్కే7లో వెంటిలేషన్ మెరుగుపర్చాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ఆర్కే7 గనిలో వెంటిలేషన్ మెరుగుపర్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కె బాజీ సైదా ఆర్కే 7 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. గనిలోపల కార్మికులకు గాలి అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, కార్యదర్శి బేర రవీందర్, సహాయ కార్యదర్శి పరిగెల ప్రతాప్, నాయకులు పారుపల్లి రాజేందర్, కీసర రవితేజ, యాదగిరి, అన్వర్, మధుకర్ పాల్గొన్నారు.

తాత్కాలిక గుడిసెల తొలగింపు


మాట్లాడుతున్న సంకె రవి

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలోని భూముల్లో పేదలు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెలను గురువారం తొలగించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ గుడిసెలు కూల్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు లేక ఇక్కడ గుడిసెలు వేసుకున్నారని, వాటిని కొందరు నిర్దాక్షిణంగా కూలగొట్టారన్నారు. గత ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్రహ్మయ్య, కావిరి రవి, అనిల్, సమ్మక్క, ఉమారాణి, రేణుక, రాజేశ్వరి, భూదేవి, సరిత, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


రోదిస్తున్న బాధిత కుటుంబం

భీమిని: మండలంలోని వెంకటాపూర్‌లో గురువారం ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అంబిలపు సుధాకర్ తన భార్యతో కలిసి కూలి పనికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు నగదు సైతం కాలిబూడిదైంది. ఇంట్లో ఉన్న సిలిండర్ సైతం పేలినప్పటికీ దగ్గరలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష కుపైగా నగదు కాలిపోయింది. మొత్తం రూ.6 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని కన్నెపల్లి ఎస్సై గంగారాం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు సందర్శించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

చట్టాలు.. సరికొత్తగా..

- జూలై 1 నుంచి అమలు
- ఫిర్యాదుల నుంచి సమన్ల జారీ వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే..
- సత్వర న్యాయానికి రెండే వాయిదాలు
- హేయమైన నేరాల దృశ్యాలకు వీడియోగ్రఫీ తప్పనిసరి
- పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా జీరో ఎఫ్ఐఆర్
- అధికారులు, సిబ్బందికి పది రోజుల పాటు శిక్షణ


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

నిర్మల్‌టౌన్: జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులు, సమన్ల జారీ వంటివన్నీ ఇకపై ఆన్‌లైన్ ద్వారానే జరగనున్నాయి. దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి చట్టాలలో భారీ మార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో ప్రభుత్వం భారీ మార్పులు చేసింది. 'భారతీయ న్యాయ సంహిత–2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత–2023, భారతీయ సాక్ష్య అధినియమ్–2013గా మార్చింది. ఈ కొత్త చట్టాల అమలులో పలు మార్పులు కనిపించనున్నాయి. ఇకపై అన్నీ ఎలక్ట్రానిక్ మాధ్యమంలోనే జరగనున్నాయి. హేయమైన నేరాలకు సంబంధించిన నేర దృశ్యాలను తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేస్తారు. ఈ కొత్త చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 13 నుండి 23 వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్లో పరిధిలోని 508 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణకు సమన్వయ అధికారిగా డీసీఆర్బీ సీఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ రవికుమార్, శిక్షకులుగా సీఐలు నవీన్ కుమార్, సైదారావు, ఎస్సైలు సాయి కుమార్, సాయి కిరణ్, జ్యోతిమని వ్యవహరించారు.

కొత్త చట్టాలు ఇవే..

- బాధితుడు ఇకపై నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేయవచ్చు.
- జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం ఎవరైనా పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చు.
- అరెస్టయిన బాధితుడు విషయాన్ని తన స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియజేసే వీలుంటుంది. దీనివల్ల బాధితుడికి తక్షణసాయం లభిస్తుంది. అరెస్ట్ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు, జిల్లా హెడ్‌క్వార్టర్‌లో బహిరంగంగా ప్రదర్శిస్తారు. దీనివల్ల బాధిత కుటుంబ సభ్యులు, స్నేహితులకు ముఖ్యమైన సమాచారం తెలిసే వీలుంటుంది.
- హేయమైన నేరాల్లో వీడియోగ్రఫీ తప్పనిసరి. దీనివల్ల దర్యాప్తులో నాణ్యత పెరిగే అవకాశం ఉంది.
- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు రెండు నెలల్లోనే పూర్తి కావాలి. బాధిత మహిళలు, చిన్నారులకు ఉచితంగా ప్రాథమిక చికిత్స, వైద్య చికిత్స అందించాల్సి ఉంటుంది.
- సమన్లను ఇకపై నేరుగా వెళ్లి ఇవ్వాల్సిన పనిలేదు. ఆన్‌లైన్‌లో పంపించవచ్చు. తద్వారా పేపర్ వర్క్ తగ్గించి, అన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సమాచారం అందించేలా ఈ చట్టాన్ని రూపొందించారు.
- మహిళలపై నేరాల విషయంలో బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేయాలి. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి.
- బాధితులతో పాటు నిందితులకు కూడా ఎఫ్ఐఆర్ కాపీ నకలును ఉచితంగా అందిస్తారు. పోలీస్ రిపోర్ట్, చార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లో పొందవచ్చు.
- సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకొని, సాక్షుల పరిరక్షణ పథకాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలి.
- అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.
- మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు 15 ఏళ్లలోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. వారు తాము నివసిస్తున్న చోటే పోలీసుల సాయం పొందవచ్చు.
- స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్తులకు సమాజ సేవ చేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి.
- న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించడంతో పాటు వేగంగా కేసుల పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఈ చట్టాలు రూపొందించబడ్డాయి.

పోలీసులకు అవగాహన ఉండాలి



కొత్త చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలి. అప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలుగుతారు. అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరం. అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అవసరాన్నిబట్టి ప్రజా భద్రతకోసం చట్టాలను రూపకల్పన చేయడం జరిగింది. కొత్త చట్టాలపై జిల్లా పోలీసులకు విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించాం.

– జానకీ షర్మిల, నిర్మల్ ఎస్పీ

పెట్రోల్‌లో నీళ్లొచ్చాయని నిరసన


పెట్రోల్‌లో కలిసిన నీటిని చూపిస్తున్న మల్లేశ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో కొనుగోలు చేసిన పెట్రోల్‌లో నీళ్లువచ్చాయని బాధితుడు నిరసన తెలిపాడు. పట్టణానికి చెందిన మల్లేశ్ గురువారం పొలం పనులకు వెళ్లేందుకు తన బైక్‌లో పెట్రోల్ పోసుకున్నాడు. కొద్దిదూరం వెళ్లగానే బైక్ ఆగిపోవడంతో మెకానిక్ వద్దకు వెళ్లగా ట్యాంక్‌లో నీరుందని చెప్పి బాటిల్‌లో నింపి ఇచ్చాడు. దీంతో బాధితుడు బంకు వద్దకు వచ్చి ఆందోళన చేపట్టాడు. తన బైక్ చెడిపోయిందని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీనిపై బంకు నిర్వాహకులను అడుగగా ఎలా జరిగిందో తెలియదని, మెకానిక్‌ను పిలిపించి తెలుసుకుంటామన్నారు.

బెల్లం, పటిక పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడిహేటిలో గురువారం నాటుసారా తయారీదారులకు సరఫరా చేస్తున్న బెల్లం, పటిక పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించగా టాటాఏస్ ట్రాలీలో సరఫరా చేస్తున్న 760 కిలోల బెల్లం, 70 కిలోల పటిక పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు లంబడిహేటి గ్రామానికి చెందిన శ్యాంలాల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.


పట్టుకున్న బెల్లం, పటికతో ఎక్సైజ్ అధికారులు

ప్రభుత్వ భూమి కబ్జాపై సర్వే


సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో 422 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని గర్మిళ్ల శివారులో గల సర్వే నంబర్లు 92, 93లోని భూముల హద్దులతో పాటు, మంచిర్యాల రెవెన్యూ పరిధిలోని 422 సర్వే నంబరులో గల భూమిలో హద్దులు గుర్తించేందుకు వచ్చామన్నారు. 422 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని కబ్జా చేశారంటూ జిల్లా కేంద్రానికి చెందిన తులా మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు డిప్యూటీ డైరెక్టర్ హోదా వ్యక్తితో సర్వే చేయించాలని కోరడంతో వచ్చినట్లు తెలిపారు. గుర్తించిన హద్దుల వివరాలను కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, రాష్ట్ర సర్వేయర్ సంధ్య, ఏడీ శ్రీనివాస్, ఆర్ఐ అజీజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వయో పరిమితిపై నివేదిక కోరిన కోర్టు

మందమర్రిరూరల్: సింగరేణిలో 100 జూనియర్ మైనింగ్ ఇంజనీరింగ్ ట్రెయినీ (జేఎంఈటీ) పోస్టులకు 2024 జూన్ 10 వరకు 18 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. పట్టణానికి చెందిన అనవేన సుభాష్ 11 జూన్ 2024 వరకు 18 సంవత్సరాలు నిండుతాయని దీని వలన తాను దరఖాస్తు చేయడానికి అర్హత ఉండడం లేదని హైకోర్టును ఆశ్రయించాడు. ఈ విషయంపై ఆగస్టు 7, 2024 నాటికి నివేదిక ఇవ్వాలని సంస్థ సీఎండీ ఆదేశించిందని కోర్టు ఇచ్చిన ప్రతిని సంస్థ సీఎండీకి అందజేసి న్యాయం చేయాలని కోరినట్లు సుభాష్ తెలిపాడు.


కోర్టు ప్రతిని సీఎండీకి అందిస్తున్న అభ్యర్థి